క్లుప్తంగా

ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి

దావులూరు(కొల్లిపర): పేదల ఇళ్ల నిర్మాణాలపై మండల, గ్రామస్థాయి అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని మండల ప్రత్యేక అధికారి ఆర్.జె.కృష్ణారావు ఆదేశించారు. ఆయన బుధవారం దావులూరులోని జగనన్న హౌసింగ్ కాలనీల్లో ఇళ్ల నిర్మాణ పురోగతిని ఎంపీడీవో పి.శ్రీనివాసులు, తహసీల్దార్ జి.నాంచారయ్యతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇస్తున్న నగదుతో పాటు పొదుపు సంఘాల ద్వారా అందిస్తున్న రుణం, కాలనీలో ప్రభుత్వం కల్పిస్తున్న మౌలిక వసతులు గురించి లబ్ధిదారులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. బిలో బేస్‌మెంట్ స్థాయిలో ఇళ్ల నిర్మాణాలపై ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ సమీక్షలు నిర్వహించారు. బేస్‌మెంట్ స్థాయికి తెచ్చేందుకు కృషి చేయాలని తెలిపారు.

తడిసిన పంటలను ప్రభుత్వం కొనుగోలు చేయాలి

కొల్లిపర: అకాల వర్షాల కారణంగా కల్లాల్లో తడిసిన జొన్న, మొక్కజొన్న , పసుపు పంటల్ని మద్దతు ధరకు ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. మున్నంగి, వల్లభాపురం, పిడపర్రు, పిడపర్తి పాలెం గ్రామాల్లో బుధవారం ఆయన రైతు నాయకుడు వంగా శివశంకరరెడ్డితో కలసి మొక్కజొన్న పంటను పరిశీలించారు. జరిగిన నష్టాన్ని రైతుల్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శివసాంబిరెడ్డి మాట్లాడుతూ తడిసిన మొక్కజొన్న గింజల్ని గ్రామంలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

ఆశ్రమాల్లో వృద్ధులకు అన్నదానం

తెనాలి టౌన్: నాజరుపేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమం, గాంధీనగర్‌లోని షిర్డీ సాయి వృద్ధాశ్రమంలో బుధవారం శ్రీ వెంకటేశ్వర యోగా సేవా కేంద్రం సభ్యురాలు ఎం. సామ్రాజ్యం సహకారంతో వృద్ధులకు అన్నదానం చేశారు. సాలిగ్రామ మఠం ట్రస్ట్ వ్యవస్థాపకులు బాల స్వామీజీ పండ్లు పంపిణీ చేశారు. గంగానది పుష్కరాలు ముగింపు సందర్భంగా ఆయన వాటి విశిష్టత తెలియజేశారు. కార్యక్రమంలో ఎస్వీ యోగా కన్వీనర్ ఎం.రమణయ్య, సామ్రాజ్యం, అనూష, దీక్షిత, తేజ, ఆశ్రమాల నిర్వాహకులు మురళి, భారతి, సత్య నారాయణ, సుజాత, యోగా సాధకులు పాల్గొన్నారు.

పేదలకు అండగా జగన్ ప్రభుత్వం

'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శివకుమార్


ఎమ్మెల్యే శివకుమార్ నుంచి ఆటోగ్రాఫ్ తీసుకుంటున్న చిన్నారులు

తెనాలి రూరల్: గత ప్రభుత్వం మాదిరి కాకుండా ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని పేద, బడుగు, బలహీనవర్గాలకు అండగా ఉంటోందని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తెలిపారు. తెనాలి మండలం జగ్గడిగుంటపాలెం గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం బుధవారం రాత్రి మూడో రోజు కొనసాగింది. గ్రామ సచివాలయ సిబ్బంది, అధికారులతో కలసి ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లారు. ప్రజలకు అందించిన సంక్షేమ పథకాల్ని తెలియజేయడంతోపాటు వారి సమస్యలనూ తెలుసుకునే ప్రయత్నం చేశారు. అనంతరం మాట్లాడుతూ బీసీలు, పేదలు ఎక్కువగా ఉండే జగ్గడిగుంటపాలెంలో ప్రతి ఒక్కరికీ తమ ప్రభుత్వంలో న్యాయం జరుగుతోందని పేర్కొన్నారు. గ్రామంలో రూ. 91 లక్షలతో చేపట్టిన అభివృద్ధి పనులు పూర్తయ్యాయని, మరో రూ. 72 లక్షల పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. గ్రామ సచివాలయం కోసం రూ. 40 లక్షలు, ఆర్బీకే కోసం రూ. 20 లక్షలు కేటాయించినట్టు చెప్పారు. గ్రామస్తులు తన దృష్టికి తీసుకువచ్చిన స్థానిక సమస్యల పరిష్కారం కోసం గ్రామ సచివాలయానికి రూ. 20 లక్షల్ని సొంత నిధుల నుంచి విడుదల చేస్తున్నట్టు ఎమ్మెల్యే శివకుమార్ ప్రకటించారు. రెండు నెలల్లో సమస్యలు పరిష్కారమయ్యేలా చూస్తామని తెలిపారు. ఎమ్మెల్యే వెంట గ్రామ సర్పంచ్ కుంభం బాలాజీ, ఎంపీటీసీ సభ్యురాలు కాజా భద్రావతి, ఎంపీపీ చెన్నుబోయిన శ్రీనివాసరావు, పార్టీ గ్రామ అధ్యక్షుడు పసుపులేటి వెంకయ్య, కౌన్సిలర్లు యాతాటి అనిల్, షేక్‌దుబాయ్ బాబు, గుంటూరు కోటేశ్వరరావు, పార్టీ నాయకులు భీమవరపు సంజీవరెడ్డి, అక్కిదాసు కిరణ్‌కుమార్, కఠారి హరీష్, ఆరాధ్యుల కోటేశ్వరరావు, కాళిదాసు సత్యం, గ్రామ సచివాలయ సిబ్బంది ఉన్నారు.

విలువైన వైశ్య విద్యానిధి స్థలం అన్యాక్రాంతం!

పట్టణంలో హాట్‌టాపిక్

తెనాలి: పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరి వైశ్య విద్యానిధికి చెందిన విలువైన అన్యాక్రాంతమైంది. చదరపు గజం రూ.50 వేలకు పైగా విలువ చేసే 240 గజాల స్థలాన్ని నిర్మలా మాతాజీ ధ్యాన మందిరం పేరుతో అన్యాక్రాంతం చేయడం సోషల్ మీడియాలో వైరల్ అయింది. వైశ్య విద్యానిధి పెద్దలు, మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ సాయంతో ఈ స్థలాన్ని చేతులు మార్చారని ఆరోపిస్తూ ఆర్యవైశ్యులు మేలుకోవాలని, భూమిని సంరక్షించుకోవాలంటూ చేసిన విజ్ఞప్తి ఇప్పుడు పట్టణంలో హాట్‌టాపిక్‌గా మారింది.

1902 గజాల స్థలం విరాళం

పేద ఆర్యవైశ్య విద్యార్థుల వసతి కోసం గంగానమ్మపేటలో శ్రీకన్యకాపరమేశ్వరి వైశ్య విద్యానిధి నడుస్తోంది. అక్కడ ఉంటూ విద్యాభ్యాసం చేసే విద్యార్థుల భవిష్యత్, సంక్షేమం కోసమని పూర్వీకులు నాజరుపేటలో 1902 గజాల స్థలాన్ని గతంలోనే విరాళంగా సమకూర్చారు. కాలగమనంలో అది ఆక్రమణలకు గురైంది. వైశ్య విద్యానిధి కమిటీ తగిన ఆధారాలతో కోర్టును ఆశ్రయించింది. 2023 మార్చి 21న తెనాలి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఇచ్చిన ఇంజక్షన్ ఆర్డరుతో ట్రస్టు సంరక్షణలోకి వచ్చింది. ఆ తర్వాత నెలరోజులకే ఆ స్థలంలోని 240 గజాల్ని ధ్యాన మందిరానికి విక్రయించి ఏప్రిల్ 28న రిజిస్ట్రేషను తంతును పూర్తి చేసినట్టు సమాచారం. చదరపు గజం హీన పక్షం రూ.50 వేలకు పైగా ఉండే స్థలాన్ని రూ.1.20 కోట్లకు విక్రయించి, అందులో రూ.20 లక్షలు మాత్రమే వైశ్య విద్యానిధికి చెందేలా చూశారని, మిగిలిన కోటి రూపాయలను కైంకర్యం చేశారనేది ఆరోపణ.

ట్రస్టు సభ్యులకు ఫోనులో బెదిరింపులు?

ఈ మొత్తం వ్యవహారానికి సూత్రధారి మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ కాగా, పాత్రధారి వైశ్య విద్యానిధి కమిటీ కార్యదర్శి, మున్సిపల్ మాజీ చైర్మన్ పెండేల వెంకట్రావుగా ఆరోపిస్తున్నారు. ఇది సమంజసం కాదని ప్రశ్నించిన ట్రస్టు సభ్యులు పెండేల చంద్రశేఖర్, కొప్పురావూరు కిశోర్‌ను మాజీ మంత్రి ఆలపాటి రాజా ఫోనులో బెదిరించారని చెబుతున్నారు. ఈ తర్వాతనే సోషల్ మీడియాలో విషయం వైరల్ అవుతోంది. వాస్తవానికి ట్రస్టు సభ్యుల్లో ఒకరైన కొప్పురావురు కిశోర్ గత మున్సిపల్ ఎన్నికల్లో పట్టణ ఏడో వార్డు నుంచి టీడీపీ తరపున పోటీ చేసిన అభ్యర్థి. ఆ పార్టీకి చెందిన కౌన్సిలరు అభ్యర్థి, సదరు స్థలం అన్యాక్రాంతంపై కమిటీ కార్యదర్శిని ప్రశ్నించడం ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇదిలా వుంటే, కమిటీ కార్యదర్శి పెండేల వెంకట్రావు, శ్రీవాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం సత్రం కమిటీ అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు కలసి మీడియా సమావేశం ఏర్పాటుచేసి, సోషల్ మీడియాలో ప్రచారాన్ని ఖండించటం విశేషం. స్థలం విషయంలో అక్రమాలు జరిగిందన్న ఆరోపణల్లో నిజం లేదని, ఆలపాటి రాజాకు సంబంధం లేదని కమిటీ కార్యదర్శి పెండేల వెంకట్రావు ఖండించారు. వాస్తవాలు వాసవీ అమ్మవారికే ఎరుక అంటూ ఆర్యవైశ్యులు పెదవి విరుస్తున్నారు.

రాజీ కేసులన్నీ పరిష్కారమయ్యేలా చూడాలి

పోలీసుల అధికారుల సమావేశంలో న్యాయమూర్తి శ్రీసీత

తెనాలి రూరల్: రాజీ అయ్యే అవకాశం ఉన్న కేసులన్నీ జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ అయ్యేలా చూడాలని రెండో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె. శ్రీసీత పోలీసు అధికారులకు సూచించారు. ఈ నెల 13వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్న నేపథ్యంలో పోలీసులతో బుధవారం ఆమె సమావేశమయ్యారు. సివిల్, క్రిమినల్, రోడ్డు ప్రమాదాలు, ప్రి లిటిగేషన్ వంటి కేసులన్నీ పరిష్కారమయ్యేలా కక్షిదారులతో మాట్లాడాలని సూచించారు.

కళాకారుడు సుబ్రహ్మణ్యానికి సత్కారం

తెనాలి: విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్టీరామారావు శతజయంతి ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక పెమ్మసాని థియేటరులో ఎన్టీఆర్ నటించిన 'ఛాలెంజ్ రాముడు' సినిమాను ఉచితంగా ప్రదర్శించారు. రోజుకొక కళాకారుడికి సత్కారంలో భాగంగా ప్రముఖ కళాకారుడు, గాయకుడు నల్లూరి శ్రీనివాస్‌ను థియేటర్ కమిటీ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో కె.వి. సుబ్రహ్మణ్యం, కాళహస్తి రఘు, తుల్లిమిల్లి మరియదాసు, పరుచూరి సుబ్బారావు, వినుకొండ శ్రీరామమూర్తి, మేకా శివశంకర్, పెమ్మసాని పోతురాజు, అయినాల మల్లేశ్వర రావు, దేవరపల్లి భవాని పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిరసన

తెనాలి: విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పట్టణంలో బుధవారం ప్రతిపక్ష పార్టీలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. స్థానిక బోసురోడ్డులోని అమరజీవి పొట్టి శ్రీరాములు విగ్రహం వద్ద చేపట్టిన నిరసనలో కాంగ్రెస్, టీడీపీ, జనసేన, ఏపీ నవచైతన్య బీసీ సంక్షేమ సంఘం, వామపక్షాలు, కార్మిక, విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చందు సాంబశివుడు, పట్టణ అధ్యక్షుడు పాస్నూరు నాగసూర్య శశిధరరావు, టీడీపీ నాయకులు మహమ్మద్ ఖుద్దూస్, అన్నం పిన్నారావు, జనసేన నాయకులు బండారు రవికాంత్, బెల్లపు యశ్వంత్ కుమార్, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, బీసీ సంక్షేమ సేవా సంఘం అధ్యక్షుడు మేడిబోయిన గంగాయాదవ్, ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లిముంత కృష్ణ, మునిపల్లి శ్రీకాంత్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు పాశం వెంకటేష్, కోలా శేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతపై అవగాహన

తెనాలి: వేసవి సెలవుల్లో ప్రభుత్వ పాఠశాలల్లో పరిశుభ్రతపై ఆయాలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మండల విద్యాధికారి డాక్టర్ మేకల లక్ష్మీనారాయణ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో టీఎంఎఫ్ ఫండ్ కింద విధులు నిర్వహిస్తున్న ఆయాలకు బుధవారం స్థానిక కొత్తపేటలోని తాలూకా హైస్కూలులో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో ఆయాలు ప్రతిరోజూ ఉదయం పాఠశాలలకు తప్పనిసరిగా హాజరుకావాలని ఆదేశించారు. టాయ్‌లెట్ బ్లాకు, పరిసర ప్రదేశాల్ని పరిశుభ్రంగా ఉంచాలని చెప్పారు. వాటర్ ట్యాంకుల క్లీనింగ్, తాగునీటి యూనిట్‌ను శుభ్రంగా చేసే విధుల్ని శ్రద్ధగా చేయాలని స్పష్టం చేశారు. సమావేశంలో ఆయాలతోపాటు ఎంఆర్సీ సిబ్బంది పాల్గొన్నారు.

గిన్నిస్ బుక్‌లో నాగశ్రీకి స్థానం



తెనాలి టౌన్: తెనాలి మండలం కొలకలూరు గ్రామానికి చెందిన మల్లిశెట్టి నాగశ్రీవేదప్రణవి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో స్థానం సంపాదించారు. అమెరికాలోని టెక్సాస్‌లో గత నెలలో నిర్వహించిన భగవద్గీత మహాపారాయణంలో 10–13 సంవత్సరాల విభాగంలో పాల్గొని బంగారు పతకాన్ని ప్రణవి సాధించింది. విశ్రాంత ఉపాధ్యాయులు, దివంగత మల్లిశెట్టి సుబ్బారావు కుమారుడు మల్లిశెట్టి కుమార్ వ్యాస్, శిరీష దంపతులు అమెరికాలోని న్యూజెర్సీలో స్థిరపడ్డారు. వీరి కుమార్తె వేదప్రణవి, గణపతి సచ్చిదానంద స్వామి నుంచి అవార్డు అందుకున్నట్లు వ్యాస్ తెలిపారు. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో పేరునమోదు చేసుకున్న కొలకలూరు నుంచి మొదటి చిన్నారి కావడం విశేషం. గత ఆరు సంవత్సరాల నుంచి కుమార్ వ్యాస్ దంపతులు అమెరికాలో ఉంటున్నారు. గిన్నిస్ బుక్ రికార్డులో పేరు నమోదు చేసుకోవడంపై వేద ప్రణవిని గ్రామంలోని పలువురు అభినందించారు. అభినందించిన వారిలో గ్రామ మాజీ సర్పంచులు ఉన్నం ఫకీల, వల్లూరు వరప్రసాద్, ఐటీసీ డీలర్ యడ్లపల్లి రవికిరణ్, తోట నాగేశ్వరరావు, బండి శ్రీనివాస్, పొన్నెకంటి సాంబశివరావు, మంచికలపూడి వెంకటేశ్వరరావు, తాడిబోయిన శ్రీనివాసరావు ఉన్నారు.